వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక
TGTEL/25/A4812
సంపుటి : 01| సంచిక : 79 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శుక్రవారం | జులై 03, 2026

## రండి.. అప్పుల సంగతి తేలుస్తా

హరీష్ రావుకు మంత్రి జూపల్లి మరోమారు సవాల్!



2లో..

## అప్పులపై కాంగ్రెస్ అబద్ధాల వేట

- జూపల్లివి పూటకో మాట.. రోజుకో అడ్రస్!
- మంత్రి సవాళ్లపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు ధ్వజం
- రేవంత్ రెడ్డి ఒకలా.. జూపల్లి మరోలా మాట్లాడుతున్నారు!
- తప్పుడు లెక్కలు చెబుతున్న వారే రాజీనామా చేయాలి



2లో..



## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలపై
# కేంద్రం కసరత్తు

- ఈ నెల 20 నుంచే సభలు?
- మరోమారు మహిళా, డీలిమిటేషన్ బిల్లులు పెట్టే యోచన!
- సమావేశాలకు ముందే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ?
- ఢిల్లీ టూ తెలుగు రాష్ట్రాలు..
- రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ!

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఈ నెలాఖరులో ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశ రాజకీయాల్లో వేడి పుట్టించబోతున్నాయి. ఈ కీలక సమావేశాల్లోనే గతంలో వీగిపోయిన ప్రతిష్టాత్మక 'మహిళా బిల్లు', 'డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లు'లను మరోమారు ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ బిల్లులు ఆమోదం పొందాలంటే పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మెజార్టీ అవసరం కావడంతో, కేంద్రం అందుకు తగ్గ వ్యూహరచన చేస్తోంది. అయితే, గత 12 ఏళ్లుగా కీలక నిర్ణయాలపై ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నించని బీజేపీ.. ఈసారి కూడా ముందస్తు అఖిలపక్ష సమావేశాలు నిర్వహించే సంప్రదాయానికి స్వస్తి పలికినట్లు తెలుస్తోంది. బిల్లుల ప్రవేశం, వ్యూహాలన్నీ కేవలం ప్రధాని మోడీ, అమిత్ షాల కనుసన్నల్లోనే అత్యంత గోప్యంగా సాగుతుండటంతో ప్రతిపక్షాలు ఊహకు కూడా అందని పరిస్థితి నెలకొంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. పార్లమెంట్ సమావేశాల కంటే ముందే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉండబోతుందనే వార్తలు దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్నాయి. ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడంతో ఈ ఊహాగానాలకు బలం చేకూరింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు, ప్రభుత్వ పనితీరును వేగవంతం చేయడం, ప్రస్తుత రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని కీలక మార్పులు చేయబోతున్నారు. బిజెపి సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో మార్పులు చేర్పుల జాబితా ఖరారైనట్లు సమాచారం. ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆమె స్థానంలో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను కేబినెట్‌లోకి తీసుకురావచ్చనే ప్రచారం సాగుతోంది. పేపర్ లీకేజీల వివాదం నేపథ్యంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు ఉన్నాయి. అనురాగ్ ఠాకూర్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లనుండగా, జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలకు చోటు దక్కనుంది. ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, బెంగాల్ ఎంపీలతో పాటు శివసేన (రెబెల్) నుంచి శ్రీకాంత్ షిండేకు, ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్‌కు కూడా ఛాన్స్ దక్కవచ్చని టాక్. కేంద్ర కేబినెట్ విస్తరణ ప్రభావం తెలుగు రాష్ట్రాలపై స్పష్టంగా పడనుంది. ముఖ్యంగా తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మంత్రులలో మార్పు ఉంటుందా అనే చర్చ నడుస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌కు మరో అదనపు మంత్రి పదవి దక్కే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏపీ నుండి టీడీపీ తరఫున ఇద్దరు, బీజేపీ తరఫున ఒకరు కేంద్ర మంత్రివర్గంలో ఉన్నారు. ఏపీలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి బలంగా ఉండటంతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరో మంత్రి పదవిని సాధించేలా సీఎం చంద్రబాబు నాయుడు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ నాలుగో పదవి వస్తే అది ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. సామాజిక సమీకరణాల ప్రకారం మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరు పరిశీలనలోకి రావచ్చు. ఒకవేళ బీజేపీకే ఆ పదవి దక్కితే మహిళా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. ప్రాంతాల వారీగా చూస్తే ఉత్తరాంధ్ర లేదా రాయలసీమ ప్రాంతాలకు ఈసారి ప్రాతినిధ్యం పెరిగే ఛాన్స్ ఉంది. మొత్తం మీద కొత్త వారికి అవకాశం ఇస్తారా లేక అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. ఏపీకి అదనపు మంత్రి పదవి దక్కితే కేంద్ర నిధులు, ప్రాజెక్టుల సాధనలో రాష్ట్రానికి మరింత మేలు జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు. భవిష్యత్తులో జరగబోయే ఈ కీలక రాజకీయ పరిణామాలు దేశ, రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి.

## అమర్‌నాథ్ యాత్రికులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

- యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం: ప్రధాని
- భక్తుల కోసం 'ఎక్స్' వేదికగా ఐదు కీలక సంకల్పాలు
- ఖర్చుల్లో 10 శాతం స్థానిక ఉత్పత్తులకే కేటాయించాలని పిలుపు



2లో..

## వరంగల్ జిల్లా దంపతుల ఆత్మహత్య

- ఘట్‌కేసర్ వద్ద రైలు కిందపడి సూసైడ్
- మృతులు పాపయ్యపేట గ్రామస్థులు రవికుమార్, శిరీష
- ఘట్‌కేసర్ - బీబీనగర్ రైల్వే ట్రాక్‌పై దారుణం
- గ్రామంలో మిన్నంటిన విషాద చాయలు



2లో..

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH

శుక్రవారం, జులై 03, 2026

# రండి.. అప్పుల సంగతి తేలుస్తా

## హరీష్ రావుకు మంత్రి జూపల్లి మరోమారు సవాల్!

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర అప్పుల వివాదంపై బీఆర్ఎస్ నేతలకు మంత్రి జూపల్లి కృష్ణారావు మరోసారి బహిరంగ సవాల్ విసిరారు. అబద్ధపు మాటలతో ప్రజలను ఇకపై మభ్యపెట్టలేరని ఆయన హెచ్చరించారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో అప్పులపై చర్చకు తాను సిద్ధమని, సాయంత్రం 5 గంటలకే అక్కడకు వస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి బీఆర్ఎస్ అగ్రనేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రాష్ట్ర అప్పులపై చర్చకు మీరు సిద్ధమైతే ముందే చెప్పండి. నేను చెప్తున్న లెక్కలు తప్పని రుజువైతే నా మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేస్తా. మరి నా సవాల్‌ను స్వీకరించి, మీ లెక్కలు తప్పైతే మీరు రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?" అని జూపల్లి ప్రశ్నించారు. ఒకవేళ కేసీఆర్ చర్చకు రాకపోతే, జూపల్లి చెప్తున్న లెక్కలే నిజమని మీడియా ముఖంగా ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. 'పాలమూరు పౌరుషమా.. కల్వకుంట్ల పౌరుషమా.. తేల్చుకుందాం' అంటూ కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులకు సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో కేటీఆర్, హరీష్ రావు ఇద్దరూ అసెంబ్లీలోనే వేర్వేరు సందర్భాల్లో పరస్పర విరుద్ధమైన లెక్కలు చెప్పారని మంత్రి ఆరోపించారు. కేటీఆర్ చెప్పిన లెక్కలు రాష్ట్ర అప్పు ఒకసారి రూ. 3,17,015 కోట్లు అని, మరోసారి రూ. 3,85,045 కోట్లు అని పేర్కొన్నారు. హరీష్ రావు చెప్పిన లెక్కలు: అప్పుల మొత్తం ఒకసారి రూ. 4,26,499 కోట్లు అని, ఇంకోసారి రూ. 4,17,496 కోట్లు అని సభను తప్పుదోవ పట్టించారు. "కానీ, కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే సమయానికి రాష్ట్రంపై ఉన్న అసలు అప్పు రూ. 8,21,651 కోట్లు" అని జూపల్లి స్పష్టం చేశారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన భారీ అప్పులను కేటీఆర్, హరీష్ రావు ఎందుకు దాస్తున్నారని ఆయన నిలదీశారు. మిషన్ భగీరథ వంటి పథకాల కోసం తెచ్చిన అప్పులను ప్రజలు కట్టాలా అని ప్రశ్నించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, ఎప్పటికీ తన మాటపై కట్టుబడి ఉంటానని మంత్రి స్పష్టం చేశారు. కేటీఆర్, హరీష్ రావుల తీరు 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి కూడా రాజీనామా చేసిన చరిత్ర గలవాడినని, వ్యాపారాలు చేసి, ఆర్థికంగా స్థిరపడిన తర్వాతే రాజకీయాల్లోకి వచ్చానని.. కేవలం అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకునే అలవాటు తనకు లేదని జూపల్లి కృష్ణారావు తేల్చిచెప్పారు.

# అమర్‌నాథ్ యాత్రికులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

- యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం: ప్రధాని
- భక్తుల కోసం 'ఎక్స్' వేదికగా ఐదు కీలక సంకల్పాలు
- ఖర్చుల్లో 10 శాతం స్థానిక ఉత్పత్తులకే కేటాయించాలని పిలుపు



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పవిత్ర అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, శివభక్తులు భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. ఈ మేరకు భక్తులను ఉద్దేశించి రాసిన ఒక ప్రత్యేక లేఖను ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "ప్రతి సంవత్సరం మంచు లింగాన్ని నేరుగా దర్శించుకునే అవకాశం లక్షలాది మంది భక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ ఏడాది యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని ప్రధాని పేర్కొన్నారు. భిన్న ప్రాంతాలు, భాషలు, ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఏకైక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, బాబా బర్ఫానీ సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' ఆవిష్కృతమవుతుందని కొనియాడారు. యాత్ర సజావుగా సాగడానికి శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్రకు వెళ్లే భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలి. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను పూర్తిగా పాటించాలి. జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక కుటుంబాలకు, యువతకు ఉపాధి కల్పించేలా.. యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10% మొత్తాన్ని అక్కడి స్థానిక ఉత్పత్తుల కొనుగోలుకు కేటాయించాలి. 'ఏక్ పేడ్ మా కే నామ' (అమ్మ పేరిట ఒక మొక్క): రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. ప్రతి ఒక్కరూ తమ తల్లి జ్ఞాపకార్థం ఒక మొక్కను నాటాలి. మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత' నిర్మాణంలో ప్రతి ఒక్కరూ చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, బాబా అమర్‌నాథ్ ఆశీస్సులతో భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

# అప్పులపై కాంగ్రెస్ అబద్ధాల వేట

- జూపల్లివి పూటకో మాట.. రోజుకో అడ్రస్!
- మంత్రి సవాళ్లపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు ధ్వజం
- రేవంత్ రెడ్డి ఒకలా.. జూపల్లి మరోలా మాట్లాడుతున్నారు!
- తప్పడు లెక్కలు చెబుతున్న వారే రాజీనామా చేయాలి



**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన 'ఎస్ఐఆర్' అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అప్పుల వివాదంపై మంత్రి జూపల్లి కృష్ణారావు విసురుతున్న సవాళ్లను హరీశ్ రావు తిప్పికొట్టారు. జూపల్లి తీరు 'పూటకో సవాల్.. రోజుకో అడ్రస్' లా మారిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రికి, మంత్రులకు అసలు అప్పులపై అవగాహన ఉందా అని హరీశ్ రావు ప్రశ్నించారు. ఇద్దరి లెక్కల్లోని వ్యత్యాసాలను ఆయన ఈ సందర్భంగా ఎండగట్టారు. నాలుగు నెలల క్రితం నిండు అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అప్పు రూ. 3,45,294 కోట్లు అని ప్రకటించింది. గత నాలుగు నెలల అప్పులు కూడా కలిపితే ఇది రూ. 4 లక్షల కోట్లు దాటుతుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో చేసిన అప్పు కేవలం రూ. 1,77,058 కోట్లు మాత్రమేనని నాకు రాసిన లేఖలో జూపల్లి పేర్కొన్నారు. "సీఎం రేవంత్ రెడ్డి ఒక మాట చెబితే, మంత్రి జూపల్లి ఇంకో మాట చెబుతున్నారు. ప్రభుత్వంలోనే లెక్కలు తేలడం లేదు. మరి ఇప్పుడు తప్పుడు లెక్కలు చెబుతున్నందుకు రాజీనామా ఎవరు చేయాలో వారే తేల్చుకోవాలి" అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. మంత్రి జూపల్లి సవాళ్లు నిన్నే చూశామని, ఏమైందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని హరీశ్ రావు అన్నారు. "మొదట తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పింది ఆయనే. వెంటనే మాట మార్చి గన్‌పార్క్‌కు వెళ్లారు. తీరా మేము చర్చకు వస్తుంటే పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. ఇప్పుడు కొత్తగా చర్చకు కేసీఆర్ రావాలని అనడం హాస్యాస్పదం" అని విమర్శించారు. మంత్రి జూపల్లి వాట్సప్‌లో పెట్టిన లేఖలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసిన అప్పుల వివరాలు ఉన్నాయని హరీశ్ రావు గుర్తుచేశారు. "తాము వచ్చాక రూ. 1.77 లక్షల కోట్ల అప్పు చేశామని జూపల్లే ఒప్పుకున్నారు. కానీ, ఆర్‌బీఐ వద్ద తెచ్చిన ఎఫ్ఆర్‌బీఎం ప్పులతో కలిపి చూస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అసలు అప్పు రూ. 1.86 లక్షల కోట్లు. కేంద్ర బ్యాంక్ వద్ద తెచ్చిన అప్పుల్లోనే ప్రభుత్వానికి స్పష్టత లేదు. ఏం చేయాలో పాలుపోక, జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికే (డ్యామేజ్ కంట్రోల్) కాంగ్రెస్ నేతలు ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారు" అని హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# వరంగల్ జిల్లా దంపతుల ఆత్మహత్య

- ఘట్‌కేసర్ వద్ద రైలు కిందపడి సూసైడ్
- మృతులు పాపయ్యపేట గ్రామస్థులు రవికుమార్, శిరీష
- ఘట్‌కేసర్ - బీబీనగర్ రైల్వే ట్రాక్‌పై దారుణం
- గ్రామంలో మిన్నంటిన విషాద చాయలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రైలు కిందపడి భార్యాభర్తలు బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గురువారం రాత్రి జరిగిన ఈ దారుణ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన రవికుమార్, శిరీష దంపతులు ఘట్‌కేసర్ సమీపంలోని ఘట్‌కేసర్ – బీబీనగర్ రైల్వే మార్గంలో వేగంగా వస్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ట్రాక్‌పై మృతదేహాలు పడి ఉన్నాయనే సమాచారం అందుకున్న వెంటనే జీఆర్‌పీ (రైల్వే) పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల బట్టి మృతులను వరంగల్ జిల్లాకు చెందిన దంపతులుగా గుర్తించారు. ఈ ఘోర కలికలంపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అసలు ఆ దంపతులు అంతటి కఠిన నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు, కుటుంబ సమస్యలా లేక ఆర్థిక ఇబ్బందులా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. దంపతుల మృతికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులు పాపయ్యపేటలోని వారి కుటుంబ సభ్యులకు చేరవేశారు. కాగా, రవికుమార్, శిరీషల హఠాన్మరణంతో పాపయ్యపేట గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

# సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్
- కీటక జనిత వ్యాధుల నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలు చేపట్టాలి
- చార్మినార్ ఏశ్ర హాస్పిటల్‌లో వైద్యాధికారులతో విస్తృత స్థాయి సమీక్ష




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. సూరజ్ భాను క్లస్టర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలు, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలతో శనివారం చార్మినార్‌లోని ఏశ్ర హాస్పిటల్ సమావేశ మందిరంలో ఆయన కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సూచికల వారీగా సమగ్ర సమీక్ష జరిపారు. కార్యక్రమాల అమలులో వేగం పెంచి, నిర్దేశిత లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలి. గర్భిణీల సంరక్షణ, నాణ్యమైన వైద్య సేవలు మరియు శిశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందేలా చూడాలి. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలు, ఉచిత వైద్య సేవలు మరియు ఆరోగ్య పథకాల ప్రయోజనాలపై ప్రతి అర్హులైన లబ్ధిదారునికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి.



బాధ్యతాయుత సేవలు: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని స్పష్టం చేశారు. డాక్టర్ శ్రీధర్–వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ (ఇమ్యునైజేషన్), డాక్టర్ అనిత–అదనపు జిల్లా వైద్యాధికారి – అంటువ్యాధుల నివారణ చర్యలు, డా.సాయిబాబా, డా.శ్రీకల, డా. ఆశ్రిత రెడ్డి ప్రభుత్వ ఆరోగ్య పథకాల క్షేత్రస్థాయి అమలు, పర్యవేక్షణ, శ్రీనివాస్ (డిప్యూటీ డెమో), సంతోష్ (డిపీఓ) ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలు, రోజువారీ నివేదికలు అందించాలన్నారు. "ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా, పకడ్బందీగా అమలు చేయాలి. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా సీజనల్ వ్యాధులు ప్రబలడానికి కారణమవుతుంది కాబట్టి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు నిరంతరం అలర్ట్‌గా ఉండాలి." అని డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, క్లస్టర్ పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బందికి విధుల్లో పాటించాల్సిన మార్గదర్శకాలు, దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సూచనలు చేశారు.

# విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణే ముఖ్యం



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. కాజీపేట మండలంలోని మడికొండ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనశాల, తాగునీటి సౌకర్యాలు, తరగతి గదులు, వసతి గృహాలు, మరుగుదొడ్లు మరియు పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లలో పారిశుధ్య లోపాలను గమనించిన కలెక్టర్ అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనశాలలో మెనూ ప్రకారం భోజనం అందుతున్న తీరు, ఆహార నాణ్యతను పరిశీలించారు. డైనింగ్ హాల్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. మరుగుదొడ్లు & పారిశుధ్యం నిరంతరం నీరు వృథాగా ప్రవహించడం, దుర్వాసన వెదజల్లడంపై తీవ్ర ఆగ్రహం. బాధ్యులైన సిబ్బందిపై వెంటనే చర్యలకు ఆదేశించారు. తాత్కాలిక పారిశుధ్య సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని వినియోగించాలి. పారిశుధ్య లోపాల వల్ల విద్యార్థులు అంటువ్యాధుల బారిన పడి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వసతి గృహాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ అధికారి, కాజీపేట తహసీల్దార్ రాజు, పాఠశాల ప్రిన్సిపాల్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడకు అదనంగా 500 ఇందిరమ్మ ఇండ్లు

- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పట్టుదలతో నిధుల మంజూరు
- 18వ వార్డులో ఘనంగా రెండో విడత గృహ నిర్మాణాలకు భూమిపూజ

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సమాజంలోని నిరుపేద, అణగారిన వర్గాల సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అక్షరాలా సాకారం చేస్తోందని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్పష్టం చేశారు. వేములవాడ పట్టణ పరిధిలోని 18వ వార్డులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం స్థానిక కౌన్సిలర్ కొండ రాజశేఖర్‌తో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. పేదవాడి సొంతింటి కల కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో నిజం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ ముఖ్య సంకల్పమని కొనియాడారు. అదనపుంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడకు అదనంగా 500 ఇండ్లు మంజూరు. రాజకీయాలకు అతీతంగా, ఎలాంటి సిఫార్సులు, అవినీతి లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా పారదర్శక ఎంపిక చేశారు. పట్టణంలో ఇండ్లు లేని నిరుపేద కుటుంబం ఒక్కటి కూడా ఉండకూడదనే మహత్తర ఆశయంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి. గృహ నిర్మాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వేములవాడ నియోజకవర్గ అభ్యున్నతికి రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో, మున్సిపల్ యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. "గత పాలకుల వలె కాకుండా, ప్రజా ప్రభుత్వంలో అర్హులకు మాత్రమే లబ్ధి చేకూరుతోంది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వేములవాడ నిరుపేద ప్రజల పట్ల ఉన్న అపారమైన ప్రేమ, తపనకు ఈ అదనపు ఇళ్ల మంజూరే సజీవ సాక్ష్యం. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేరుస్తాం." అని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, హౌసింగ్ ఏఈ, వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు ప్రముఖులు, స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సహకారంతోనే సమృద్ధి సమాజం – సమృద్ధి భారత్

- ఘనంగా సహకార వారోత్సవాల 5వ రోజు వేడుకలు
- రాష్ట్రంలోనే ఉప్పునుంతల వినూత్న సేవలు ఆదర్శం
- సహకార శాఖ ఎండీ అన్నపూర్ణ




**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "సహకారంతోనే సమృద్ధి సమాజం – సమృద్ధి భారత్" అనే నినాదంతో ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 5వ రోజు సహకార వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ సహకార శాఖ మేనేజింగ్ డైరెక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ.. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఉప్పునుంతల సహకార సంఘం రైతులకు అందిస్తున్న వినూత్న సేవలు రాష్ట్రంలోని ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె కొనియాడారు.రాష్ట్రంలో మొత్తం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పీఏసీఎస్–906, రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా (ఎఫ్ పీఓ) ఎంపికైన సంఘాలు–311, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఎంపికైన ఎఫ్‌పీఓలు–16, ప్పునుంతల వేరుశెనగ డీకార్టికేటర్ సామర్థ్యం గంటకు 2 టన్నులుగా ఉంది. ఇతర ఎఫ్‌పీఓలతో పోలిస్తే ఉప్పునుంతల భిన్నమైన సేవలతో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఎండీ అన్నపూర్ణ ప్రశంసించారు. గంటకు 2 టన్నుల సామర్థ్యం గల వేరుశెనగ డీకార్టికేటర్, ఆధునిక డ్రోన్ సేవలు, వెయ్ బ్రిడ్జ్. పాల సేకరణ కేంద్రం, సకాలంలో ఎరువుల పంపిణీ, టార్పాలిన్‌ల సరఫరా. తక్కువ వడ్డీకే బంగారు రుణాలు,యు వ్యవసాయ రుణాలు ఇక్కడి రైతులకు అందుతున్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా రైతులకు అందే రాయితీలు, ప్రయోజనాలను డీసీఓ రఘునాథ్ రావు వివరించారు. బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద ఏర్పాటు చేసిన వేరుశెనగ డికార్టికేటర్ వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి, నాణ్యమైన మార్కెటింగ్ లభిస్తుందని తెలిపారు. ఉప్పునుంతల సహకార సంఘం చేపట్టిన వ్యాపార అభివృద్ధి ప్రణాళికను జిల్లా సంయుక్త రిజిస్ట్రార్ పరిమళా దేవి అభినందించారు. ఈ వినూత్న కార్యక్రమం సంఘం మరింత వృద్ధి సాధించడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపిస్తున్న సంఘం చైర్మన్, సీఈఓ మరియు పాలకవర్గ సిబ్బంది కృషిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని డిజిటల్, సాంకేతిక సేవలను రైతులకు చేరువ చేయాలని ఆకాంక్షించారు.



# స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

## చిన్న వ్యాపారాలు, కుట్టు మిషన్లు, బైక్‌ల పంపిణీ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ క్రైస్తవ మైనార్టీ ఆర్థిక సంస్థ ద్వారా అర్హులైన క్రైస్తవ మైనారిటీ అభ్యర్థుల నుంచి వివిధ స్వయం ఉపాధి పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ చైర్మన్ దీపక్ జాన్, అచ్చంపేట క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మీసాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి బొంత ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ రాయితీ పథకాలను క్రైస్తవ మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అందుబాటులో ఉన్న పథకాలు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం–ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ, ఆర్థిక సహాయ పథకం–చిన్న వ్యాపారాలు ప్రారంభించుకోవడానికి రూ.50,000, డ్రైవర్ సాధికారత కార్యక్రమం ఈ–బైక్‌లు, ఈ–స్కూటీలు, పెట్రోల్ బైక్‌లు / స్కూటీలు (ఒక్కొక్కటి రూ. 1,50,000/- విలువైనవి) అందుబాటులో ఉన్నాయి. కుట్టు మిషన్లు, చిన్న తరహా వ్యాపార యూనిట్లకు దరఖాస్తు చేసేవారి వయస్సు 21 నుండి 55 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ–బైక్, ఈ–స్కూటీ, మోటార్ బైక్ యూనిట్ల కోసం 21 నుండి 50 ఏళ్ల వయస్సు వారు అర్హులు. దరఖాస్తుదారుల వార్షిక కుటుంబ ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ. 2,00,000లోపు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000లోపు ఉండాలి. అర్హులైన వారు tgobmms.cgg.gov.in అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తులకు 18 జూలై 2026 ఆఖరి గడువు. దరఖాస్తు ప్రక్రియలో ఏవైనా సందేహాలుంటే 040-29801130 లేదా 040-23391067 నంబర్లను సంప్రదించవచ్చు.

# గడువులోగా ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలి

- కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
- వెలమలపల్లిలో 'ఎస్ఐఆర్' ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్
- పారదర్శకంగా, తప్పుల్లేకుండా డిజిటలైజేషన్ చేయాలని ఆదేశం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని వెలమలపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలోని 20వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరు చనమోని మల్లేష్ ఇంటికి స్వయంగా వెళ్లిన కలెక్టర్.. అక్కడ జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, నింపిన దరఖాస్తుల స్వీకరణ, వివరాల ధ్రువీకరణ మరియు డిజిటలైజేషన్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు, బూత్ లెవల్ అధికారులకు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. వెలమలపల్లి గ్రామం (20వ పోలింగ్ కేంద్రం)348 మంది 100% ఫారాల పంపిణీ పూర్తి (5 గురి వివరాలు ఆన్‌లైన్ నమోదు) అయ్యింది. వంగూరు మండల వ్యాప్తంగా 33,395 మంది ఇప్పటివరకు 90% పంపిణీ ప్రక్రియ పూర్తయ్యింది. గ్రామంలోని ప్రతి అర్హ ఓటరికీ ఎన్యూమరేషన్ ఫారం అందాలి. ఇళ్లల్లో అందుబాటులో లేని ఓటర్లను మరోసారి సంప్రదించి ఫారాలు సేకరించాలి. ఒక్క ఇల్లు కూడా సర్వే నుంచి తప్పిపోకూడదు. ఓటరు వివరాల నమోదు సమయంలో



పేర్లు, చిరునామా, వయస్సు, గుర్తింపు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. చిన్న పొరపాట్లకు కూడా తావివ్వకుండా డిజిటల్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి. ఫారాలు నింపడంలో ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే బీఎల్‌వోలు స్వయంగా సహాయం చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలి. సూపర్‌వైజర్లు తమ పరిధిలోని రోజువారీ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి. "ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా సవరణను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం ప్రతి అధికారి బాధ్యత. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుండి తప్పిపోవడానికి వీల్లేదు." అని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న రికార్డులు, ఫారాల నిర్వహణను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, వంగూరు తహసీల్దార్ మురళీమోహన్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళా సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

## రూ.30 లక్షల నిధులతో భవన నిర్మాణం

**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మండల పరిధిలోని ఎల్లపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన నూతన గ్రామ మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శుక్రవారం భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. అందులో భాగంగానే ప్రతి గ్రామంలో మహిళా సంఘ భవనాలను రూ. 30 లక్షల నిధులతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ పనులన్నీ యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయని తెలిపారు. ఆర్థిక లావాదేవీలు మహిళా సంఘాల సమావేశాలు, బ్యాంకు లింకేజీలు, రుణాలపై చర్చలు జరపడానికి అనుకూలంగా ఉంటుంది. స్వయం ఉపాధి శిక్షణ, కుట్టు మిషన్ల శిక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి జీవనోపాధి కార్యక్రమాలకు శాశ్వత వేదిక ఈ భవనం ఏర్పాటైతే కల్పించనట్లవుతుంది. నైపుణ్యాభివృద్ధి మహిళల్లో వృత్తి నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించుకోవచ్చు. సంక్షేమం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడానికి ఒకే చోట వసతి కల్పించవచ్చు. ఈ మహిళా సంఘ భవన నిర్మాణాన్ని ఎక్కడా నాణ్యత లోపించకుండా, అత్యంత వేగంగా పూర్తి చేసి త్వరగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒకే చోట మహిళలకు అన్ని రకాల ఉపాధి అవకాశాలు, శిక్షణ లభించేలా ఈ భవనం రూపుదిద్దుకోనుందని ఆయన పేర్కొన్నారు. "మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు, తద్వారా సమాజం బాగుపడుతుంది. మహిళల నైపుణ్యాభివృద్ధికి, స్వయం ఉపాధి శిక్షణకు ఈ భవనాలు శాశ్వత వేదికగా ఉపయోగపడతాయి." అని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీడీవో, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముందుగా గుర్తిస్తేనే 'స్కోలియోసిస్'కు చెక్




- స్పెషలిస్ట్ స్పైన్ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ మధుకిరణ్

**వరంగల్/హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వెన్నెముకకు సంబంధించిన తీవ్రమైన వైకల్యాలను ముందస్తు గుర్తింపు ద్వారానే నివారించవచ్చని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ స్పెషలిస్ట్ స్పైన్ సర్జన్, డాక్టర్ యార్లగడ్డ మధుకిరణ్ స్పష్టం చేశారు. 'స్కోలియోసిస్ అవేర్నెస్ మంత్' సందర్భంగా శనివారం హాస్పిటల్ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్కోలియోసిస్ అనేది వెన్నెముక పక్కకు వంగిపోవడంతో పాటు తిరిగినట్లు అయ్యే ఒక త్రీ–డైమెన్షనల్ వైకల్యమని పేర్కొన్నారు. చాలా సందర్భాల్లో ఈ సమస్య తీవ్రమయ్యే వరకు బాధితులు గుర్తించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ హెల్త్ చెకప్‌ల ద్వారా దీన్ని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే.. దీర్ఘకాలిక నొప్పి, సంక్లిష్టమైన సర్జరీల అవసరం లేకుండానే నయం చేయవచ్చన్నారు. ఈ వ్యాధి సాధారణంగా కౌమారదశ పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి తల్లిదండ్రులు పిల్లల శారీరక మార్పులపై నిఘా ఉంచాలని వైద్యులు సూచించారు. భుజాలు ఒకదానికొకటి అసమానంగా ఉండటం. నడుము లేదా తుంటి భాగం సమానంగా లేకపోవడం. ఒక వైపు భుజం ఎముక వెనుకకు పొడుచుకు వచ్చినట్లు ఉండటం. వెన్నెముకలో స్పష్టమైన వంపు కనిపించడం ఈ వ్యాధి లక్షణాలు. "ప్రారంభ దశలో ఉన్న స్కోలియోసిస్ కేసులను కేవలం అబ్జర్వేషన్, ఫిజియోథెరపీ, బ్రేసింగ్ ద్వారా సులభంగా మేనేజ్ చేయవచ్చు. కానీ నిర్లక్ష్యం చేస్తే మాత్రం శారీరక ఆకృతి దెబ్బతినడమే కాకుండా.. ఊపిరితిత్తుల పనితీరు తగ్గడం, తీవ్రమైన వెన్నునొప్పి, మానసిక ఒత్తిడి వంటి ప్రమాదకర సమస్యలకు దారితీస్తుంది." అని యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణులు తెలిపారు. సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో స్కోలియోసిస్ బాధితుల కోసం అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు యాజమాన్యం తెలిపింది. అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్ ఎవాల్యుయేషన్, అత్యాధునిక స్క్రీనింగ్ పద్ధతుల ద్వారా రోగులకు సమగ్రమైన సంరక్షణ అందిస్తున్నట్లు స్పెషలిస్ట్ స్పైన్ సర్జన్, డాక్టర్ యార్లగడ్డ మధుకిరణ్ పేర్కొన్నారు. మేనేజర్ రూపేష్ షిండే, అసిస్టెంట్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.